క్లుప్తంగా

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలందుకున్న నవనాగ గణపతి

ఆదోనిఅర్బన్: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా మండలంలోని పెద్ద హరివాణంలో వెలసిన నవనాగ గణపతి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి క్షీరాభిషేకం, శేష ద్రవ్యములతో అభిషేకాలు చేపట్టారు. పసుపుతో అలంకరించి పుష్పోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్, కర్నూలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సతీమణి శైలజ స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు సుబ్రహ్మణం శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

విజేతలకు బహుమతుల ప్రదానం


ఆదోనిరూరల్: మండలంలోని బల్లేకల్, పాండవగల్, గణేకల్ గ్రామాల్లో సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ చేతులమీదుగా అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు జె.రామాంజనేయులు, బి.వీరారెడ్డి, డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీకృష్ణ, ఉచ్చీరప్ప, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి విశేష పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని సదాశివనగర్‌లో వెలసిన శబరి అయ్యప్ప స్వామి దేవస్థానంలో కేరళలోని అయ్యప్ప స్వామి దివ్యదర్శనం (మకర జ్యోతి) పురస్కరించుకొని మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గురుస్వాములు మల్లికార్జున, దేవేంద్ర, అయ్యప్ప భక్తాదుల సమక్షంలో మకర జ్యోతిని వెలిగించారు. ఆ తర్వాత 18 మెట్లను పుష్పాలంకరణ దీపాలు వెలిగించి మహా మంగళహారతి ఇచ్చారు. దేవస్థానం కమిటీ సభ్యులు సుబ్బన్న, అంపాల వెంకటేశులు, లవకుమార్, భానుప్రకాష్, రంగస్వామి, తిరుమలేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జయంతి


జయంతి ఉత్సవాల్లో వడ్డెర కుల బాంధవులు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో అఖిల భారత వడ్డె ఓబన్న సేవాసమితి కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం సిద్ధరామేశ్వర స్వామి జయంతి, వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వడ్డెర కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. వడ్డె ఓబన్న సేవలను గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఆ సమితి జిల్లా అధ్యక్షుడు పోస్టు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు వడ్డె రామన్న, అంజి ఆర్ట్స్, నాగరాజు, గ్రామపెద్దలు కురువ దేవేంద్రప్ప, మెడికల్ నాగరాజు, వడ్డెర కులబాంధువులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి


మృతుడు చంద్రబాబు (ఫైల్)

హాలహర్వి: మండలంలోని బాపురం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన చంద్రబాబు (34) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రబాబు కర్ణాటకలోని కారేకల్ గ్రామంలో బసాయి ఫ్యాక్టరీలో సివిల్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన విధులు ముగించుకొని బాపురం గ్రామానికి బైకుపై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో చంద్రబాబు తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం బళ్లారి ఓపీడీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చంద్రబాబు మృతిచెందాడు. కుటుంబానికి అండగా ఉన్న చంద్రబాబు మృతిచెందడంతో తల్లిదండ్రులు అమరమ్మ, వీరభద్రప్ప కన్నీరుమున్నీరుగా విలపించారు. బాధిత కుటుబసభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్ర, రామిరెడ్డి తదితరులు పరామర్శించారు.


ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి


ఉత్సవాల్లో పాల్గొన్న రాంపురం రెడ్డి సోదరులు

రమణీయం.. రామలింగేశ్వరుడి మహారథోత్సవం

- భక్తులతో కిటకిటలాడిన రాంపురం క్షేత్రం
- రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సాయిప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి


పూజలందుకుంటున్న రామలింగేశ్వర స్వామి


అశేష భక్తజనుల మధ్య సాగుతున్న రథయాత్ర

మంత్రాలయం: భక్తజనుల హర్షధ్వానాలు.. మంగళవాయిద్యాల సుస్వరాలు.. శంభో శివ శంభో అంటూ భక్తులు పఠిస్తుండగా రామలింగేశ్వరుడు మహారథంపై కొలువు దీరారు. అశేష భక్తజనుల మధ్య ఉత్సవమూర్తి మహారథంపై ఊరేగారు. మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవం మంగళవారం సంక్రాంతి కనుమ పండుగ సందర్భంగా రమణీయంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు, టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి నేతృత్వంలో స్వామివారి రథయాత్ర కనులపండువగా సాగింది. ముందుగా ఉత్సవమూర్తి రామలింగేశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలను పఠిస్తూ మహారథంపై కొలువుంచి యాత్రకు అంకురార్పణ పలికారు. శివనామస్మరణ పఠిస్తూ భక్తులు రథం గొలుసులను చేతబూని రథాన్ని ముందుకు లాగారు. ఆలయం నుంచి 100 మీటర్ల మేర రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. వేలాదిగా భక్తులు కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. తుంగాతీరమంతా భక్తజనులతో కనువిందు చేసింది. చెక్కభజనలు, ఊయల ఆటలు భక్తులను ఆకట్టుకున్నాయి. వేడుకలో ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, యువ నాయకులు వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి, వై.ధరణీధర్ రెడ్డి, వై.మనోజ్‌కుమార్ రెడ్డి, వై.భీమా రెడ్డి, మహిళా నాయకురాలు నైరుతి రెడ్డి, ప్రియాంక రెడ్డి, ఆలూరు వైఎస్సార్‌సీపీ సమన్వకర్త విరుపాక్షి, డీఎస్పీ సీతారామయ్య, ఆయా మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం-ఆంధ్ర పోటీలు

కౌతాళం: ఆడుదాం – ఆంధ్ర క్రీడాపోటీల్లో భాగంగా మండలస్థాయి క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. మంగళవారం ఎరిగేరి, కుంటనహాల్ గ్రామాల మధ్య, నదిచాగి, బదినేహాల్ గ్రామాల మధ్య, కుంబళనూరు, బదినేహాల్ మధ్య క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. పోటీలను ఎంపీడీఓ సుబ్బరాజు టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులు తమ సత్తాను చాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇలాంటి పోటీల వల్ల గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలన్నారు. పీఈటీలు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంట ఉన్నారు.

గడ్డివామి దగ్ధం


మంటలను ఆర్పుతున్న స్థానికులు

పెద్దకడబూరు: మండల కేంద్రం పెద్దకడబూరులో తంబల భీమేష్ అనే రైతుకు చెందిన గడ్డివాము కాలిబూడిదైంది. పశువుల మేత కోసం నిల్వ ఉంచిన గడ్డివామికి మంగళవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు చెలరేగడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా వీలు కాలేదు. గడ్డివామి మొత్తం కాలిబూడిదైంది. రూ.70 వేలు విలువ చేసే పశుగ్రాసం బూడిదైందని, ఆదుకోవాలని బాధితుడు కోరారు

రైళ్లలో నిషేధిత సామగ్రి తరలిస్తే చర్యలు


ప్రయాణికుడి బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసు

ఆదోని సెంట్రల్: రైళ్లలో నిషేధిత వస్తువులను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని రైల్వే ఎస్ఐ గోపాల్ హెచ్చరించారు. ఆయన మంగళవారం రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు ఆదోని మీదుగా వెళుతున్న రైళ్లలో తనిఖీలు చేపట్టారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రైళ్లలో కర్ణాటక మద్యంతో పాటు గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో రానున్న ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆదోని మీదుగా వెళ్లే ప్రతి రైలును ప్రతి రోజూ తనిఖీ చేస్తామన్నారు. రాత్రి పూట ప్రయాణం చేసే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైల్వేస్టేషన్ ఆవరణలో గానీ, రైళ్లలో ఎవరైనా అనుమానితులుగా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

దుద్ది కొండ ప్రాంతానికి రోడ్డు


కొండ పైవరకు సీసీ రోడ్డు వేసిన దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామంలో కొండ ప్రాంతానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులు రూ.27 లక్షలతో సీసీ ఏర్పాటు చేయించారు. గతంలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే తనయుడు వైఎస్సార్‌సీపీ యువనేత వై.ధరణీధర్ రెడ్డిని గ్రామ ప్రజలందరూ కొండ ప్రాంతానికి రోడ్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే నిధులు వెచ్చించి కొండ పైవరకు సీసీ రోడ్డు నిర్మించారు. పూర్వం గ్రామస్తులు కొండ ప్రాంతంలోనే నివాసం ఉండేవారు. ఇప్పటికీ కొంత మంది అక్కడే నివాసం ఉంటున్నారు. కొండ ప్రాంతంలోనే గ్రామ దేవతలు దేవమ్మ, మారెమ్మ దేవి కొలువయ్యారు. ఏటా దేవర ఉత్సవాలకు ప్రజలు పూర్ణకుంభాలతో కొండల్లోని వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించే వారు. ప్రతి ఏటా అష్టకష్టాలు పడుతుండేవారు. వారి సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే కొండ పై వరకు సీసీ రోడ్డు వేయించారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తలనీలాల వేలంపాట

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు తలనీలాలు పోగు చేసుకునే హక్కుల వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి, 2025 ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఏడాది పాటు తలనీలాలు పోగుచేసుకునే హక్కులను వేలంపాట ద్వారా కేటాయిస్తామని, ఆసక్తి గలవారు రూ.లక్ష ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

వైభవంగా రంగనాథుడి ఊరేగింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి వారికి సోమవారంతో ధనుర్మాస పూజలు ముగిసినట్లు ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా శ్రీరంగనాథుడికి నిర్వహిస్తున్న ధనుర్మాస పూజల సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, అష్టోత్తర నామార్చన, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


అగసనూరు గ్రామ నాయకులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామాల్లోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. టీటీడీ ఆలయ కమిటీ సభ్యుడు వై.సీతారామిరెడ్డి సహకారంతో అగసనూరు, సజ్జలగుడ్డం గ్రామాల్లో వెలసిన శ్రీరాఘవేంద్ర స్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల అభివృద్ధికి శ్రీవాణి ట్రస్ట్ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల నాయకులకు మంగళవారం ఎమ్మెల్యే స్వగృహంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి ప్రత్యేక చొరవతో మంత్రాలయం నియోజకవర్గంలోని ఆలయాలు అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. టీటీడీ సహకారంతో ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. మొదటి విడుతగా మండలంలోని అగసనూరు గ్రామంలో కొలువుదీరిన రాఘవేంద్ర స్వామి ఆలయానికి రూ.2 లక్షలు, సజ్జలగుడ్డం గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.5.90 లక్షలు మంజూరు కాగా చెక్కును గ్రామ పెద్దలకు అందజేశారు. మిగతా నగదు త్వరలోనే ఆలయ కమిటీ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల పెద్దలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, పి.మురళీమోహన్ రెడ్డిలను శాలువా పూలమాలలతో సత్కరించారు. ఆయా గ్రామాల నాయకులు దశరథ్ రెడ్డి, ఉలిగయ్య, జేకే మల్లయ్య, ఆకాష్ రెడ్డి, ఎంకే నాగేష్, టీకే బీమన్న, నాగేంద్ర, వీరేష్, హనుమప్ప, యల్లప్ప, సతీష్, బాబు రెడ్డి, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన బోయ మునీంద్రమ్మ తన ఇంటి వద్ద కర్ణాటక మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆమె వద్ద నుంచి రెండు బాక్సుల ఓసీ కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం


మాట్లాడుతున్న టూటౌన్ సీఐ గోపి

ఆదోనిటౌన్: రోడ్డు నియమ, నిబంధనలు పాటిద్దాం.. ప్రమాదాలను అరికడదామని టూటౌన్ సీఐ గోపీ ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లకు సూచించారు. నిర్లక్ష్యం, అజాగ్రత్త, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డీఎం రఫిక్‌అహ్మద్ ఆధ్వర్యంలో 'రోడ్డు భద్రతా మాసోత్సవాలు' నిర్వహించారు. సీఐ గోపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు మాసోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలన్నారు. డ్రైవర్లు చాకచక్యంగా, ఓపికతో బస్సును నడుపుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని డీఎం రఫిక్‌అహ్మద్ సూచించారు. బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. ఆటోలు, ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాల బారిన పడొద్దన్నారు. బస్సు నడిపే సమయంలో సెల్‌ఫోన్ సంభాషణ ఉండకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ రాఘవేంద్ర, వివిధ యూనియన్ల నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బియ్యం గింజపై రామమందిర చిత్రం


బియ్యపు గింజపై రామమందిరం చిత్రించిన దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు బారికి చంద్రశేఖర్ అయోధ్య రామమందిరం చిత్రాన్ని బియ్యం గింజపై చిత్రీకరించి అబ్బురపరిచాడు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం బియ్యం గింజపై రామమందిర చిత్రాన్ని చిత్రించడంతో స్థానికులు అభినందించారు.

వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరం


బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ ఇస్మాయిల్

పెద్దకడబూరు: వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరం లాంటిదని సర్పంచ్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన ఉప్పర రాముడు గత ఆదివారం అనారోగ్యంతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్, డిజిటల్ అసిస్టెంట్ నారాయణస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ సలీం ఆధ్వర్యంలో వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలను సోమవారం ఆ కుటుంబానికి అందించారు. వారు మాట్లాడుతూ.. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నరేష్, డీలర్ నర్సింగప్ప, తిక్కన్న, మహ్మద్, రాము తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గిరకబండి పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని గ్రామ పెద్దలు వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు వై.పురుషోత్తంగౌడ్, వై.కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం వృషభాల గిరకబండి పోటీలు నిర్వహించారు. పోటీలను రుద్రగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ అంటేనే రైతులు, ఎద్దుల పండగ అన్నారు. పండించిన ధాన్యం ఇంటికి వచ్చిన తరువాత రైతులు జరుపుకొనే తొలి పండుగ సంక్రాంతి అన్నారు. గిరకబండి పోటీలకు ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి 29 మంది పోటీదారులు వచ్చినట్లు తెలిపారు.

గిరక పోటీల్లో గెలుపొందిన వృషభాలు

- నందవరం మండలం హలహర్వికి చెందిన ఈరన్న ఎద్దులు నిర్ణీత సమయంలో గిరకబండిని 3089.8 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచారు. ఆ వృషభాల యజమానులు మొదటి బహుమతి రూ.30 వేలు అందుకున్నారు.
- పత్తికొండ మండలం పులికొండ రంగన్న నాయుడు ఎద్దులు 2852 అడుగుల దూరం లాగి రూ.25 వేలు గెలుపొందాయి.
- ఆస్పరి మండలం వలగొండకు చెందిన ఈరన్న ఎద్దులు 2726 అడుగుల దూరం లాగి రూ.20 వేలు గెలుపొందాయి.
- దేవనకొండ మండలం ప్యాలకుర్తికి చెందిన అల్లాబకాష్ ఎద్దులు 2700 అడుగుల దూరం లాగి రూ.15 వేలు దక్కించుకున్నాయి.
- వరుణ్‌ప్రసాద్ ఎద్దులు 2688 అడుగుల దూరం లాగి రూ. 10 వేలు దక్కించుకున్నాయి.
- ఇందువాసికి చెందిన పోగుల తిమ్మప్ప ఎద్దులు 2654 అడుగుల దూరం లాగి రూ.8 వేలు, హరికృష్ణ ఎద్దులు 2600 అడుగులు దూరం లాగి రూ. 5 వేలను గెలుచుకున్నాయి. పోటీలను సర్పంచ్ మాల నరసమ్మ, ఎంపీటీసీలు అయప్ప, రాజు, పాలయ్య, ఆర్గనైజర్లు నల్లయ్య, మంగయ్య, రామయ్య, చాకలి నల్లయ్య గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


నదిచాగిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కౌతాళం: ఉపాధి పనులను కూలీలందరూ సద్వినియోగం చేసుకోవాలని నదిచాగి ఎంపీటీసీ లింగన్న గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ రామన్నగౌడ్ సూచించారు. మంగళవారం గ్రామంలో ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని కూలీలందరు ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలు వలస వెళ్లి ఇబ్బందులు పడకుండా ఉన్న గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే రోజువారి వేతనం రూ.272 వస్తుందని తెలిపారు. నదిచాగి మజరా గ్రామం అయిన మేళిగనూరు గ్రామ కూలీలు జాబ్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఈ కార్డు ఉన్న వారందరూ పనులకు రావాలన్నారు. జాబ్‌కార్డు లేని వారంతా రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు అందజేస్తే వెంటనే జాబ్‌కార్డు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్రాంతి సంబరాలు


హులికన్వీ గ్రామంలో మహిళలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


బదినేహాల్‌లో బహుమతుల ప్రదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దకడబూరు: మండలంలోని ప్రతి పల్లెలో సంక్రాంతి సంబరాలను మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ వేడుకలను ప్రజలు తమ కుటుంబసభ్యులతో పాటు చేసుకున్నారు. సోమవారం గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన మహిళలకు ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, పెద్దలు కానుకలను అందజేశారు. హులికన్వీ గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు మహాదేవ, నాయకులు మూకరెడ్డి, నర్సారెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొని గెలుపొందిన మహిళలకు కానుకగా స్టీల్ సామగ్రి అందజేశారు.

కౌతాళం: సంక్రాతి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఈ పోటీలను చేపట్టగా మహిళలు ఉత్సాహంగా తరలివచ్చి పాల్గొన్నారు. పోటీల్లో విజయం సాధించిన మహిళలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వీరభద్ర గౌడ్, విశ్వనాథ్ రెడ్డి చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

21న మహాదేవప్ప తాత ఆరాధన


అల్లీపురం మహాదేవప్ప తాత

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని పర్వతాపురం రోడ్డులో వెలిసిన శ్రీ అల్లీపురం మహాదేవప్ప తాత వారి 35వ పుణ్య ఆరాధన మహోత్సవం ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు మఠం నిర్వాహకులు తిమ్మన్నగౌడ్ మంగళవారం తెలిపారు. 20న గోమాత, గంగామాత, గణపతి, ఉమామహేశ్వర పూజా కార్యక్రమాలతో మొదలై 21న వేకువజాము నుంచి మహాదేవప్ప తాతకు రుద్రాభిషేకం, గంగపూజ, మహా మంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతనంగా నిర్మించిన గోపురానికి కలశ స్థాపన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఐదుగురు మఠం పీఠాధిపతులు పాల్గొంటారని, వారితో ఆధ్యాత్మిక విషయాలపై కార్యక్రమం చేపడతామన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం మహాదేవప్పతాత ఉత్సవమూర్తితో ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వీరశైవ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు.